క్లుప్తంగా

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆది, సోమవారాలు ఒంగోలులో ప్రజలకు అందుబాటులో ఉంటారని మాగుంట కార్యాలయ మేనేజర్ భవనం సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఒంగోలు చేరుకుని స్థానికంగా నిర్వహించే పలు కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొంటారు. 13వ తేదీ ఉదయం 11 గంటలకు పాత కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి స్థానికంగా తన కార్యాలయంలో ప్రజలు, కార్యకర్తలు, అభిమానులకు ఎంపీ అందుబాటులో ఉంటారు.

263 పొగాకు బేళ్ల అమ్మకాలు

ఒంగోలు రూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రం-2లో 325 పొగాకు బేళ్లు అమ్మకానికి వచ్చాయి. వాటిలో 263 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేయగా, నోబిడ్ బేళ్లు 41గా నమోదయ్యాయి. కేజీ గరిష్ట ధర రూ.200 పలకగా, కనిష్ట ధర రూ.195 పలికింది. సరాసరి ధర రూ.197గా నమోదైంది.

స్వామిత్వ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

● డీపీవో జీవీ నారాయణరెడ్డి



గ్రామ మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీపీవో నారాయణరెడ్డి

చీమకుర్తి: మండలంలోని బండ్లమూడి గ్రామంలో స్వామిత్వ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీపీవో జీవీ నారాయణరెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు. శనివారం బండ్లమూడి గ్రామాన్ని డీపీవో సందర్శించారు. సర్వేలో ఇంటి కొలతలను కచ్చితత్వంతో నిర్వహించడం వలన ఇంటి యజమానికి ప్రభుత్వం ఇచ్చే హక్కు పత్రం ద్వారా ఇంటి మీద ఆధారాలతో కూడిన సంపూర్ణ హక్కు కలుగుతుందని తెలిపారు. దాని వలన ఇంటి యజమాని హక్కు పత్రాన్ని బ్యాంక్‌లలో హామీగా ఉంచి రుణాలు కూడా పొందవచ్చని తెలిపారు. అనంతరం గ్రామంలో చెత్తసంపద కేంద్రాన్ని సందర్శించారు. రెండు తొట్లలో వర్మీకంపోస్ట్ తయారీకి అవసరమైన వానపాములు వదిలారు. చెత్త సంపద కేంద్రం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలో 6.20 లక్షల ఉద్యోగాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మారెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ, నాయకులు



మైనంపాడులో ప్రచారం చేస్తున్న దుంపా చెంచిరెడ్డి, నాయకులు

● వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి
● వైఎస్సార్ సీపీ రైతు విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ మారెడ్డి సుబ్బారెడ్డి

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే 6.20 లక్షల ఉద్యోగాలిచ్చారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి తెలిపారు. చీమకుర్తిలోని బూచేపల్లి కార్యాలయంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్న 2014 నుంచి 2019 వరకు కేవలం 34,108 ఉద్యోగాలిస్తే.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన మొదటి మూడు సంవత్సరాల్లోనే సచివాలయ ఉద్యోగాలు, ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలన్నీ కలుపుకుని మొత్తం 6.20 లక్షలని వివరించారు. వాటిలో 2.07 లక్షల ఉద్యోగాలు శాశ్వత ప్రాతిపదికన నియమించినవేనన్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఉద్యోగాలు కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికలలో పట్టభద్రులు, ఉద్యోగులు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రంతో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ తరఫున తూర్పు రాయలసీమ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాదరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీ చంద్రశేఖరరెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల స్థానాలను తెలియజేస్తూ కరపత్రాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

నాగులుప్పలపాడు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తూర్పు రాయలసీమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలపరచిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, తద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు అండగా ఉండామని ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు కోరారు. శనివారం మద్దిరాలపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోతవరం గ్రామంలోనూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉప్పుగుండూరు గ్రామంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు మాదాసు రాంబాబు ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, ఉప్పుగుండూరు శ్రీనివాస ప్రసాద్, పులిచర్ల పరంధామిరెడ్డి, కోయి హనుమయ్య, కాట్రగడ్డ శ్రీను, కొండయ్య, యోహాను, దాకా అంజిరెడ్డి, ఎంపీటీసీ అనూరాధ, పెంట్యాల శ్రీను, పాదర్తి శివ తదితరులు పాల్గొన్నారు.

మైనంపాడులో...

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మైనంపాడులో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ తరఫున పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా పోటీచేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాదరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న పీ చంద్రశేఖరరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కరపత్రాలు అందించి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ డీ రమణ, ఎంపీటీసీ సభ్యురాలు ఏ రాజకుమారి, దుంపా యలమందారెడ్డి, గొడుగు మస్తాన్, కాలేషావలి, స్థానికులు పాల్గొన్నారు.

ఒంగోలు మండలంలో..

ఒంగోలు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య చైర్మన్ వాకా బసివిరెడ్డి, ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాయపాటి అంకయ్య, కరవది సొసైటీ అధ్యక్షుడు వాకా కృష్ణారెడ్డి, ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ చప్పిడి సోమశేఖర్ శనివారం ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు తమ్మిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యరజర్లలో, సర్వేరెడ్డిపాలెంలో ఆదిశేషయ్య ఆధ్వర్యంలో, త్రోవగుంటలో సాంబయ్య, కట్టా గోపి, ప్రభాకర్‌రావు, వలేటివారిపాలెంలో రాఘవరావు, కరవదిలో సర్పంచ్ డి.కోటేశ్వరరావు, ఎంపీటీసీ-2 కోమలి, ఉలిచిలో చుంచు రామకృష్ణ, సర్పంచ్ మంచు మురళి, దేవరంపాడు దళితవాడలో నాగేశ్వరరావు, మహాలక్ష్మి, గుండాయపాలెంలో పేతురు, బాబు, సర్పంచ్ సౌజన్య, దశరాజుపల్లెలో చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీదేవి, మండువవారిపాలెంలో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ప్రచారం వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు.

కొత్తపట్నం మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం...

కొత్తపట్నం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తూర్పు రాయలసీమ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రరెడ్డి కోరారు. శనివారం మండలంలోని ఈతముక్కల, ఆలూరు, మడనూరు, కొత్తపట్నంతో పాటు 11 పంచాయతీలలో ఓటర్లను కలుసుకుని ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతిరెడ్డి చంద్రశేఖరరెడ్డిలకు అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. కరపత్రాలిచ్చి ఓటు వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షల ఉద్యోగాలిచ్చి నిరుద్యోగాన్ని రూపుమాపారని తెలిపారు. కార్యక్రమంలో కసుకుర్తి శ్రీను, సామంతుల వీరారెడ్డి, దొడ్ల రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తూర్పురాయలసీమ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ పట్టభద్రుల అభ్యర్థిగా పోటీచేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ అప్పారావు కోరారు. శనివారం రాత్రి మద్దిపాడులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, జెడ్పీటీసీ భాగ్యలక్ష్మి పుల్లారావు, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, మోరబోయిన విజయలక్ష్మి, సంజీవరావు, పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు నర్రా సురేష్, పర్యవేక్షకుడు బత్తుల ప్రసన్నకుమార్, మారెడ్డి వీరారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గట్టినేని అయ్యన్న, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ ఉన్నం ప్రశీద, మద్దా లక్ష్మీనారాయణ, జయమ్మ, పలువురు ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మద్దిపాడు: మాట్లాడుతున్న మండవ అప్పారావు, నాయకులు



పోతవరంలో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మద్దిరాలపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు



ఈతముక్కలలో ప్రచారం చేస్తున్న రవీంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

● సిబ్బందికి సూచనలు చేసిన ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు



ఒంగోలులోని డీఆర్ఆర్ఎం హైస్కూల్లో సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. నగరంలోని మున్సిపల్ పాఠశాలలతో పాటు ఇతర పాఠశాలల్లో, కళాశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ఏడు ప్రాంతాల్లో 27 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బారికేడింగ్ సౌకర్యంతో పాటు లైటింగ్, షామియానాలు, కుర్చీలు, టేబుళ్లు, శానిటేషన్ లాంటి ఏర్పాట్లు చేయిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరపాలక సంస్థ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఎలాంటి అసౌకర్యానికి తావు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని కమిషనర్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న ఒంగోలు తహసీల్దార్ మురళి

ఒంగోలు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఒంగోలు తహసీల్దార్ పసుపులేటి మురళి తెలిపారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అడ్మిన్ సెక్రటరీ, వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్లతో కూడిన ఈ హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి ఓటర్లు వారి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని, పోలింగ్ సరళిపై సమాచారం పొందవచ్చని తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తామని, ఎండ తీవ్రత దృష్ట్యా టెంట్లు వేస్తామని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి ఆహారం, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రత్యేకంగా వీఆర్వోను నియమించినట్లు తెలిపారు. పోలీస్ శాఖ సూచనల మేరకు ఎవరూ గుమికూడరాదని, నినాదాలు చేయడం, ఓటర్లను ప్రలోభపెట్టడం వంటి చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. పోలింగ్ స్టేషన్ల వద్ద నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో ఎన్నికల కోడ్ ప్రకారం సివిల్, క్రిమినల్ కేసులు నమోదవుతాయన్నారు. ప్రతి నగరంలోని అన్ని పోలింగ్ బూత్‌లకు ఒక వీఆర్వో, ఒక వీఆర్ఏ విధుల్లో ఉంటారని తెలిపారు. వారికి కేటాయించిన బూత్‌లో విధులు నిర్వర్తించాల్సిందిగా ఇప్పటికే వారికి ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ మురళి వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మెడికల్ సిబ్బంది, తాగునీటి వసతి, ఎన్నికల నిబంధనల ప్రకారం వీడియో తీయడం, వెబ్ కాస్టింగ్ జరుగుతుందన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని ఆయన కోరారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీ లక్ష్మీనారాయణ

ఒంగోలు అర్బన్: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఆంధ్రకేసరి విద్యా కేంద్రంలో శనివారం నిర్వహించిన ఇంటర్ విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్ఫూర్తిదాయకమైన అంశాలను విద్యార్థులకు తెలిపారు. ఆడపిల్లలు సోషల్ మీడియా ఉచ్చులో పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.తల్లిదండ్రులను గౌరవిస్తూ క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ముఖ్యంగా మూడు అంశాలను సంకల్పించుకుని విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్దేశించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులతో ఏదో ఒక రోజు భుజం తట్టించుకుని శభాష్ అనిపించుకోవాలని, చదువుకున్న కాలేజీకే ముఖ్య అతిథిగా వచ్చేలా ఎదగాలని, అబ్దుల్ కలాం చెప్పినట్లు సంతకం ఆటోగ్రాఫ్ అయ్యేలా ఉన్నత స్థానాలకు ఎదగాలని స్ఫూర్తి నింపారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి, ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ కరస్పాండెంట్ రామకృష్ణ, ఇతర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్వకుంట్ల ట్యాక్స్ పేరుతో దోపిడీ

● బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ తదితరులు

ఒంగోలు: ''జైలుకు పోతున్నారింక...ఆరిపోయే ముందు దీపం వంటి పరిస్థితి కల్వకుంట్ల వారిది'' అంటూ భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ పేర్కొన్నారు. స్థానిక విష్ణుప్రియ ఫంక్షన్ హాలులో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని ఆధారాలు లభ్యం అవుతుండబట్టే కల్వకుంట్ల వారికి అత్యవసరంగా మహిళల మీద ప్రేమ పుట్టుకొచ్చిందన్నారు. రాజమౌళి కన్నా కల్వకుంట్ల వారికి ఏనాడో ఆస్కార్ అవార్డు వచ్చి ఉండాల్సిందంటూ వ్యంగ్యోక్తులు విసిరారు. కల్వకుంట్ల ట్యాక్స్‌పేరుతో ప్రజలను దోచుకుంటున్నారన్నారు. 2015 అక్టోబరు 6వ తేదీ కేంద్రం చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు నిమ్జ్‌ను కేటాయించిందని, రెండు సంవత్సరాలపాటు భూమిని గుర్తించారన్నారు. తరువాత వెంటనే కేంద్రం భూమికి పర్యావరణ అనుమతులు మంజూరు చేసిందన్నారు. కేంద్రం ఆరుసార్లు సాక్షాత్తు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు 14,300 ఎకరాలకు కేవలం 1869 ఎకరాలు మాత్రమే సేకరించారని, మిగతా భూమిని సేకరిస్తే రూ.47 వేల కోట్లు పెట్టుబడులు పెట్టి 5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని సూచించిందన్నారు. అయితే రాజకీయ కారణాలతో చంద్రబాబు నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. సమావేశంలో బీజేపీ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి కందుకూరి సత్యన్నారాయణ, ఎంఎల్‌సీ వాకాటి నారాయణ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులి వెంకట కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

యద్దనపూడి: మండల కేంద్రం యద్దనపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే ప్రమీలా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 24వ తేదీన ఉదయం 10 గంటలకు 5వ తగతికి, ఇంటర్మీడియెట్‌కు మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 97045 50095 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

విత్తన గుళికలతో భూమి సారవంతం

● ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి



విత్తన గుళికలు తయారు చేయిస్తున్న సుభాషిణి

కొత్తపట్నం: 30 రకాల విత్తనాలతో విత్తన గుళికలు తయారు చేసి భూమిలో ఎదపెట్టడం ద్వారా భూమి సారవంతమై అధిక దిగుబడులు సాధిస్తారని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో శనివారం కొత్తపట్నంలో పట్టపు సురేష్, బద్దిపూడి ప్రేమానందం పొలాల్లో విత్తన గుళికలు తయారు చేసే పద్ధతిపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ 30 రకాలు.. అంటే కూరగాయలు, ఆకుకూరలు, తీగ జాతి విత్తనాలు, నూనె గింజలు, పచ్చిరొట్ట జాతుల విత్తనాలు తీసుకొచ్చి విత్తన గుళికల్లో బీజామృతం, ఘనజీవామృతం, బంకమట్టి, బూడిదతో మూడు లేయర్ల విత్తనాలు తయారు చేసుకోవాలన్నారు. అలా తయారు చేసుకున్న విత్తనాలను పొలంలో చల్లుకోవాలని సూచించారు. వర్షం పడిన వెంటనే మొలకలు వచ్చి పైరు అవుతుందని వివరించారు. కాంప్లెక్స్ ఎరువులకు బదులుగా పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా సాగు చేయడం జరుగుతుందన్నారు. దీనిని మూడు రకాలుగా ఉపయోగించుకోవచ్చన్నారు. పైరు అయిన తర్వాత పశువుల మేతగా, ధాన్యం ఉత్పత్తి చేసుకోవడం, భూమిలో దున్నుకోవడం చేసుకోవచ్చని అన్నారు. ఈ పద్ధతి ద్వారా ప్రతి రైతు పొలంలో ఎరువులు తయారు చేసుకుని ఆరోగ్య వంతమైన ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. ఇలా చేయడం వలన చీడపీడలు, తెగుళ్లను తట్టుకోవడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసింహులు, రెడ్డప్ప, మల్లీశ్వరి, జాన్సీలక్ష్మి, ఐసీఆర్పీ పాల్గొన్నారు.

'సంప్రదాయం - విజ్ఞానం' అమూల్యం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ నూనె అంకమ్మరావు, సీవీ రామకృష్ణారావు తదితరులు

ఒంగోలు: సంప్రదాయం-విజ్ఞానం గ్రంథం అమూల్యం అని ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు పేర్కొన్నారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ ఆవరణలో శనివారం సాయంత్రం జరిగిన గ్రంథావిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ నూనె అంకమ్మరావు, ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ సీవీ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ ప్రపంచం వైజ్ఞానికంగా పురిటినొప్పులు పడే సమయానికి భారతదేశం వివిధ రంగాల్లో ప్రగతిని సాధించిందన్నారు. అయితే ప్రాచీనులు కనుగొన్న అనేక విషయాలను భారతీయులు ముందుకు తీసుకువెళ్లలేక పోయారన్నారు. అలాంటి సంప్రదాయ విశేషాలకు సంబంధించిన విషయాలను సైన్స్‌తో సమన్వయం చేసుకుంటూ మిడసల మహేంద్ర చెప్పిన విధానం అభినందనీయమని తెలిపారు. సీవీ రామకృష్ణ మాట్లాడుతూ చిన్న పుస్తకంలో లోతైన విషయాలను సమగ్రంగా , హేతుబద్ధతతో ప్రస్తావించారన్నారు. భారతీయ సాహితీ సంప్రదాయాలు, వేద విజ్ఞానం, ఆచార వ్యవహారాలు, శాస్త్ర విజ్ఞానం ఏ విధంగా ఒకదానితో ఒకటి ముడిపడి జనబాహుళ్యంలో ఆచారాలుగా మారిపోయాయో చెప్పిన రీతి చక్కగా ఉందన్నారు. అంతా చదవాల్సిన పుస్తకం అన్నారు. వివాహాల్లో వడి కట్టు బియ్యం, జీలకర్ర -బెల్లం, గంజికావడి, కాలిమెట్టెలు, కట్టుబొట్టు, ముహూర్తబలం వంటి అంశాలకు శాస్త్రబద్ధమైన భాష్యాన్ని జోడించి చెప్పిన విధానం బహుబాగుందని, భవిష్యత్తులో ఇంకా మంచి పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి కుర్రాప్రసాద్ బాబు, నరసం ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, కనమాల రాఘవులు, చావా నాగేశ్వరరావు, గుంటూరు సత్యన్నారాయణ, పేర్నమిట్ట బాబూరావు, యూవీ రత్నం, సింగయ్య, ఓరుగంటి ప్రసాద్ తదితరులు పాల్గొని రచయిత మిడసల మహేంద్రను ఘనంగా శ్లాఘించారు.

అందుబాటులోకి బీఎస్ఎన్ఎల్ ఐపీ టీవీ సేవలు

ఒంగోలు: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఐపీ టీవీ సేవలు జిల్లా వాసులకు అందుబాటులోకి వచ్చాయని బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఓవీ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న గుంటూరు చంద్రమౌళి నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు రిమోట్ నొక్కి సేవలను ప్రారంభించారన్నారు. టెలికం రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ తీసుకున్న చొరవ ప్రశంసనీయమని ద్వారకా తిరుమలరావు కొనియాడారన్నారు. అదే విధంగా ఉల్కా టీవీ ప్రతినిధి మహేష్ మాట్లాడుతూ 150 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన బీఎస్ఎన్ఎల్‌తో కలిసి సేవలు అందించడం ఆనందంగా ఉందన్నారు. బీఎస్ఎన్ఎల్ ఐపీ టీవీ సేవలు కోరుకునేవారు 9490261424కు పేరు, ఊరిపేరు, మండలం పేరు వాట్సాప్ పంపాలని కోరారు.

డాక్టర్ బులుసు అపర్ణకు సాహితీ పురస్కారం



డాక్టర్ బులుసు అపర్ణ

ఒంగోలు: డాక్టర్ బులుసు అపర్ణకు కుర్రా కోటి సూర్యమ్మ స్మారక సాహితీ పురస్కారానికి ఎంపిక చేసినట్లు శ్రీమతి కుర్రా కోటి సూర్యమ్మ స్మారక సాహితీ అవార్డు ఫౌండేషన్ అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవధాన విద్యలో అసాధారణమైన ప్రతిభను కనబరుస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 260కి పైగా అష్టావధానాలు, అయిదు శతావధానాలు చేసిన ప్రముఖ రచయిత్రి, ఆధ్యాత్మిక ప్రవచకురాలు డాక్టర్ బులుసు అపర్ణ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చెందినవారని, ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంస్కృత ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న అవధాన విద్యన్మణిగా పేర్కొన్నారు. ఈ పురస్కారం ఈనెల 19న స్థానిక కాపు కళ్యాణమండపంలో శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో జరగనున్న ఉగాది కవితా మహోత్సవంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి చేతులమీదుగా అందిస్తామన్నారు.